సాగునీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్

సంగారెడ్డి బ్యూరో, జూన్ 6, ప్రభాతవార్త: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జూన్ 7న సాగునీటి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో దశాబ్ది ఉత్సవాల రోజువారి కార్యక్రమాల నిర్వహణకు జరుగుతున్న పనులపై సమీక్షించారు. ఈనెల 7న సాగునీటి దినోత్సవం కార్యక్రమంలో మంత్రి హరీష్‌రావు పాల్గొననున్నట్లు వెల్లడించారు. మునిపల్లి మండలం చిన్నచిన్నడ గ్రామంలో సంగమేశ్వర ఎత్తిపోతల పథకం పనుల భూమి పూజకు మంత్రి విచ్చేస్తున్నట్లు తెలిపారు. సాగునీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని బహిరంగ ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. జూన్ 8న ఊరురా చెరువుల పండుగను నిర్వహించాలని, చెరువు కట్టమీద ఉన్న మైసమ్మ దేవి గుడిని విద్యుద్దీకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, డిఆర్ఓ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఆయా జిల్లా అధికారులు, డిఎస్‌పి రవీందర్‌రెడ్డి, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక పాలనను గడపగడపకు తీసుకెళ్తాం

-మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

పాపన్నపేట, జూన్ 6, ప్రభాతవార్త: దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వం పాలనను పూర్తిగా గాలికొదిలేసి ప్రజాధనంతో ప్రచారం చేసుకుంటున్నారని మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి మండిపడ్డారు. మంగళవారం పాపన్నపేటలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజావాణి కార్యక్రమాన్ని దశాబ్ది ఉత్సవాలు ముగిసేవరకు రద్దు చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ధరణి పేరుతో ప్రభుత్వం దగాకు పాల్పడుతోందని, రైతుల పాలిట ధరణి శాపంగా మారిందని విమర్శించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి సరఫరా చేసి నెలరోజులు దాటుతున్నా డబ్బులను సకాలంలో ఇవ్వకపోవడం దారుణమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను గడప గడపకు వెళ్లి వివరించి ప్రజలను చైతన్యవంతులను చేస్తామన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగు రీతితో గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఇందిరమ్మ పాలన కోసం తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి వివరించారు.

మాట్లాడుతున్న ప్రశాంత్‌జీవన్‌పాటిల్

గ్రూప్-1 ప్రిలిమినరి పరీక్ష నిర్వహణకు

పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :

గ్రూప్-1 ప్రిలిమినరి పరీక్ష నిర్వహణకు పకడ్బంధీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం గ్రూప్-1 ప్రిలిమినరి పరీక్ష నిర్వహణపై పరీక్ష సెంటర్ల చీఫ్ సూపరింటెండెంట్లు, లైజన్ ఆఫీసర్స్, రూట్ ఆఫీసర్స్, ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 11న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు గ్రూప్-1 ప్రిలిమినరి పరీక్షను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో 20 సెంటర్లలో 7786 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ప్రతి అధికారి పరీక్ష నిర్వహణ రోజు, ముందు రోజు ఏంచేయాలి.. ఎలా విధులు నిర్వహించాలని దిశా నిర్దేశం చేశారు. పరీక్ష సెంటర్‌లో ప్రతి గదిని తనిఖీ చేయాలన్నారు. గదులలో పరీక్ష రాసే అభ్యర్థులు సౌకర్యవంతంగా కూర్చునేలా ఫర్నిచర్, లైట్లు, ఫ్యాన్లు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ కెమెరాలు సెంటర్ మొత్తం లేదా కనీసం చీఫ్ సూపరింటెండెంట్ గదిలో తప్పనిసరిగా ఉండాలన్నారు. అభ్యర్థులు ఉదయం 8 గంటల నుంచి బయట చెకింగ్, బయోమెట్రిక్ అయిన తర్వాతనే లోనికి పంపాలన్నారు. 10.15కి గేట్ మూసివేయాలన్నారు. వికలాంగుల కోసం స్క్రైబులను అందుబాటులో ఉంచాలన్నారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బంధీగా పరీక్షను నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డిఎఓ శివప్రసాద్, కలెక్టరేట్ ఎవో అబ్దుల్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

11న జిల్లా స్థాయి కవి సమ్మేళనం

సిద్దిపేట రూరల్, జూన్ 6, ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 11న సిద్దిపేట పట్టణంలోని విపంచి అడిటోరియంలో జిల్లా స్థాయి కవి సమ్మేళనం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ తెలిపారు. కవి సమ్మేళనంలో తెలంగాణ అస్థిత్వం, తెలంగాణ సాధించిన ప్రగతి ప్రతిబింబించేలా కవితలు ఉండాలన్నారు. కవి సమ్మేళనంలో పాల్గొనే వారు కవితలను ఈనెల 9న సాయంత్రం 5 గంటలలోపు కలెక్టరేట్‌లోని డిపిఆర్ఓ కార్యాలయంలో నేరుగా గానీ 9949351664 వాట్సాప్ ద్వారా గానీ కవితలను అందజేయాలన్నారు. కవితలను పంపించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

9న నిజాంపూర్‌లో చేప మందు ప్రసాదం

సదాశివపేట, జూన్ 6, ప్రభాతవార్త: ఈ నెల 9వ తేదీన మృగశివర కార్తిని పురస్కరించుకుని మండలంలోని నిజాంపూర్ గ్రామంలో ఉచితంగా చేపమందు ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్లు డాక్టర్ ఆడెం మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దగ్గు, దమ్ము, ఎలర్జి,ఉబ్బసానికి సంబంధించిన వ్యాధులతో అవస్థలుపడుతున్నవారికి ఉచితంగా గ్రామంలో చేప మందు ప్రసాదాన్ని పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. పూర్తి వివరాలకు 9396880163ని సంప్రదించాలని వివరించారు.

కొండపోచమ్మ ఆలయ అభివృద్ధికి సహకరించండి

మంత్రి హరీష్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

జగదేవ్‌పూర్, జూన్ 6 (ప్రభాతవార్త): శ్రీకొండపోచమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి సహకరించాలని ఆలయ కమిటీ చైర్మన్ జంబుల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. మంగళవారం రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీష్‌రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్‌లను ఆలయ కమిటీ సభ్యులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జంబుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయం అభివృద్ధికి నిధులు మంజూరుచేసి ఆలయం వద్ద నెలకొన్న పార్కింగ్, శౌచాలయాల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ఆలయ పునఃర్నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. మంత్రులు సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. మంత్రులను కలిసిన వారిలో ఆలయ డైరెక్టర్లు కుమ్మరి కనకయ్య, గోలి సంతోష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లమెంటరీ

పరీక్షల నిర్వహణ సజావుగా జరగాలి : జిల్లా కలెక్టర్ శరత్

సంగారెడ్డి బ్యూరో, జూన్ 6, ప్రభాతవార్త: ఈ నెల 12 నుంచి 20 వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్డ్ సప్లమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖల అధికారులతో కోఆర్డినేషన్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 12 నుండి 20 వరకు ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటలవరకు, ఇంటర్ సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2.30 గంటలనుండి సాయంత్రం 5.30గంటలవరకు జరుగుతాయన్నారు. ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 28 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇంటర్ ఫస్టియర్ పరీక్షలకు 10,634 మంది, సెకండ్ ఇయర్ పరీక్షలకు 4,728 మంది విద్యార్థులు (మొత్తం 15,362 మంది) హాజరుకానున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఐఓ గోవిందరామ్, డిఆర్ఓ నగేష్, డిఎస్‌పి రవీందర్‌రెడ్డి, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడు సంగమేశ్వర ప్రాజెక్టు ప్రారంభోత్సవం

న్యాల్‌కల్, జూన్ 6, ప్రభాతవార్త: మునిపల్లి మండలం చిన్న చెల్మడ గ్రామంలో ఈనెల 7వ తేదీన మంత్రి హరీష్‌రావు సంగమేశ్వర ఎత్తిపోతల ప్రాజెక్టును ప్రారంభిస్తున్నట్లు హద్నూర్ క్లస్టర్ ఏఈఓ సాయిలు తెలిపారు. మంత్రి హరీష్‌రావు ప్రారంభించే సంగమేశ్వర ప్రాజెక్టు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లాలనుకునే రైతులకు, గ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, రైతు బంధు బాధ్యులు చిన్న చెల్మడ గ్రామానికి చేరుకునేందుకు ఆర్‌టిసి బస్సు సౌకర్యం కల్పించినట్లు, ఆసక్తి గల వారు ఉదయం 9 గంటలకు హద్నూర్ గ్రామానికి చేరుకోవాలని, బస్సులో 11 గంటల వరకు చిన్న చెల్మడకు చేరుకుని ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని సాయిలు వివరించారు.

చెరువుల పండగకు అన్ని ఏర్పాట్లు చేయాలి

మెదక్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా

మెదక్, జూన్ 6 ప్రభాతవార్త : రాష్ట్రావతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించనున్న ఊరూరా చెరువుల పండుగను విజయవంతం చేయటానికి అధికారులు సమన్వయంతో పనిచేయవలసిందిగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. మంగళవారం ఎస్పీ, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఏపీవోలు, మండల కోఆర్డినేటర్లు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ గ్రామ పంచాయతీ, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 469 గ్రామ పంచాయితీలలో నిర్దేశించిన పెద్ద చెరువు వద్ద సాయంత్రం చెరువుల పండుగ ఘనంగా నిర్వహించటానికి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఇందుకు సంబంధించి ప్రతి చెరువుకు ఒక అధికారిని నియమిస్తూ కోఆర్డినేటింగ్ అధికారిని ఇచ్చామని, కార్యక్రమాల నిర్వహణకు ఎంపీడీవోలకు నిధులు మంజూరుచేశామని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ రోజే ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, పంచాయితీ కార్యదర్శులు, మత్స్య, నీటి పారుదల అధికారులు ప్రజాప్రతినిధులతో మండల స్థాయిలో సమన్వయ కమిటీ సమావేశం ఏర్పాటు చేసుకొని చెరువులను సందర్శించి చెరువు పరిసర ప్రాంతాల్లో ముళ్ల పొదలను తొలగించి నడిచేందుకు వీలుగా ఆ ప్రాంతాన్ని చదును చేయాలని, లైటింగ్, సౌండ్, మ్యూజిక్ సిస్టం ఏర్పాటుచేయాలన్నారు. ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా చిన్న చెరువుల వద్ద ఇద్దరు గజ ఈతగాళ్లు, పెద్ద చెరువులవద్ద నలుగురు గజఈతగాళ్లను పెట్టాలని, అవసరమైతే వలంటీర్లను ఏర్పాటుచేయాలని, మత్స్యశాఖ సహాయ సంచాలకులకు సూచించారు. గ్రామం నుంచి డప్పులు, బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారులు ఊరేగింపుగా బయలుదేరేలా చూడాలన్నారు. చెరువు గట్టుపై పండుగ వాతావరణం ప్రతిబింబించేలా మామిడాకులు, తోరణాలు అందంగా అలంకరించాలని, కట్టమైసమ్మ పూజ, చెరువుకు పూజలుచేయాలన్నారు. బతుకమ్మ పాటలతో పాటు గోరేటి వెంకన్న రాసిన పాటలు ప్లే చేయాలన్నారు. ఈ సందర్భంగా సాగునీటిలో సాధించిన ప్రగతి, భూగర్భ జలాల పెంపు, తద్వారా ఘననీయంగా పెరిగిన పంటల ఉత్పత్తి, మత్స్య సంపద తదితర వివరాలను ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని, కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. మంచినీళ్లు, పరిశుభ్రమైన ప్రాంతంలో వెజ్, నాన్‌వెజ్ భోజనాలకు అవసరమైన కౌంటర్లను ఏర్పాటు చేయాలన్నారు.

రాత్రి సమయం కాబట్టి మద్యం తాగి న్యూసెన్స్ చేయకుండా పెట్రోలింగ్ చేయాలని ఆబ్కారీ అధికారికి, అన్ని చెరువుల వద్ద పోలీసులను బందోబస్తుకు ఏర్పాటు చేయడం కష్టం కాబట్టి పెట్రోలింగ్ చేయాలని, ఆ సమాచారాన్ని మండల అధికారులకు తెలపాలని పోలీస్ అధికారు లకు సూచించారు. అగ్నిమాపకసిబ్బందికి అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్పీ రోహిణి ప్రియదర్శిని మాట్లాడుతూ యూనిఫార్మ్‌గల ఫారెస్ట్, ఎక్సైజ్ సిబ్బంది సేవలను వినియోగించుకోవాలన్నారు. రాత్రి సమయంలో తాగి న్యూసెన్స్ చేసే అవకాశాలున్నట్లు భావించే ప్రాంతాలలో సర్పంచులు యువ వలంటీర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెరువు ప్రమాద ప్రాంతాలలో చిన్నపాటి బ్యారీ కేడింగ్, హెచ్చరికబోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు ప్రతిమ సింగ్, రమేష్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎసిపికి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న యాదవ సంఘం నాయకులు

బీరప్ప దేవాలయ భూమిని కాపాడండి

-ఎసిపికి వినతిపత్రం అందజేసిన యాదవ సంఘం నాయకులు

గజ్వేల్, జూన్ 6 (ప్రభాతవార్త): యాదవుల ఆరాధ్య దైవమైన బీరప్ప దేవాలయ భూములను గజ్వేల్ పట్టణానికి చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధి కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం గజ్వేల్ ఏసిపి రమేష్‌కు ఫిర్యాదు పత్రాన్ని అందజేసినట్లు యాదవ సంఘం ప్రజ్ఞాపూర్ అధ్యక్షుడు దువ్వల బిక్షపతి పేర్కొన్నారు. ప్రజ్ఞాపూర్‌లోని బీరప్ప దేవాలయం ప్రాంగణంలో సర్వే నెంబర్ 307లో 2.12 గుంటల భూమి తుమ్మ రాములు పేరుపై రికార్డులో ఉందని, ఇందులో బీరప్ప దేవాలయానికి 0.05 గుంటల భూమి పట్టాదారు అయిన తుమ్మ రాములు సుమారు 30 సంవత్సరాల క్రితం దేవాలయానికి దానపూర్వకంగా ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన 2.07 గుంటల భూమి తుమ్మ రాములు వారసుడు 2009 సంవత్సరంలో ఎండి.షరీఫొద్దీన్‌కు అమ్మగా ఇట్టి స్థలాన్ని వెంచర్ చేసినప్పుడు బీరప్ప దేవాలయానికి పాత 5 గుంటల భూమి కాకుండా అదనంగా 1437 చదరపు గజముల భూమి ఇచ్చి మిగతా స్థలాన్ని ప్లాట్లు చేసినట్లు పేర్కొన్నారు. 2015 సంవత్సరంలో అప్పటి మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్‌తో పాటు అతని మిత్రులు కొనుగోలు చేసి లేఅవుట్ మార్పిడి చేసి కొత్తగా ప్లాట్లు చేశారు. దేవాలయ స్థలంలో 5 గుంటల స్థలం మాది అని పిట్ల రాజు అనే వ్యక్తి కబ్జాకు వచ్చి పాత హద్దులు మార్చి కొత్తగా హద్దులు పాతి దేవాలయంకు చెందిన భూమి మాది అని బెదిరింపులకు గురిచేయడంతో గత ఏప్రిల్ నెలలో స్థానిక సిఐ వీరప్రసాద్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. భూమి మరోసారి సర్వే చేయించుకొని సిఐకి సర్వే రిపోర్ట్ చూపించినట్లు పేర్కొన్నారు. మంగళవారం ఉదయం పిట్ల రాజు కొంత మంది అనుచరులతో వచ్చి హద్దులు మార్చడానికి ప్రయత్నం చేయడంతో దేవాలయ భూమిని అన్యాక్రాంతం చేయడం మంచిదికాదని, అతనికి గజ్వేల్ పట్టణానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధి అండతో ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు పేర్కొన్నారు. దేవాలయ భూములను కాపాడి మాకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఏసిపికి ఫిర్యాదు చేసిన వారిలో యాదవ సంఘం ఉపాధ్యక్షుడు రొట్టెల శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి చీర్ల యాదగిరియాదవ్, ఐలయ్యయాదవ్, మంద సదానందం, సంతోష్‌యాదవ్, లింగంయాదవ్, గట్టు రమేష్, కొమురయ్య, కనకరాజు, ఐలేష్, మలెమైన నర్సయ్య, మల్లయ్య, చీర్ల కనకరాజు, దువ్వల శ్రీనివాస్, మహేష్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం

సిద్దిపేట రూరల్, జూన్ 6, ప్రభాతవార్త : పేరణి నృత్యకళాకారులు డాక్టర్ నటరాజ రామకృష్ణ వర్ధంతి సందర్భంగా సిద్దిపేట పట్టణ శ్రీ భవాని క్లాసికల్ డ్యాన్స్ అకాడమీ చేపట్టిన పేరణి, అంధ్ర నాట్యం, కూచిపూడి నాట్యం వేసవి శిక్షణ శిబిరం ముగింపు సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజులరాజనర్సు, పట్టణ బిఆర్ఎస్ అధ్యక్షులు కొండం సంపత్‌రెడ్డిలు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అన్నగొని వినోద్‌గౌడ్, సద్ది నాగరాజురెడ్డి, డ్యాన్స్ అకాడమీ నిర్వహకులు డాక్టర్ గాడిచెర్ల భవాని విజయ్ పాల్గొన్నారు.

మంత్రి హరీష్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేత

మంత్రి హరీష్‌రావుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న చంద్రశేఖరశర్మ సిద్ధాంతి

వర్గల్, జూన్ 6 (ప్రభాతవార్త): వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రానికి అనుబంధంగా నిర్మించిన శ్రీశంకరమఠం, శ్రీశారద స్మారక వేద విద్యాలయ ప్రారంభ మహోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్‌రావుకు ఆహ్వాన పత్రికను అందజేశారు. కంటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి చేతులమీదుగా ఈనెల 11వ తేదీన జరిగే వివిధ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు సిద్ధాంతి తెలిపారు.స్వామివారి విజయ యాత్రలో భాగంగా మూడు రోజుల పాటు వర్గల్ శ్రీ శంకరమఠంలో కంచి పీఠాధిపతి వివిధ కార్యక్రమాలలో పాల్గొననున్నట్లు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్‌రావు వేదపండితులు అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, వేద ఆశీర్వచనాలు అందజేశారు. సిద్ధాంతి చంద్రశేఖరశర్మ నేతృత్వంలో ప్రముఖ క్షేత్రంగా విలసిల్లుతున్న వర్గల్ శ్రీ విద్యాధరి ఆలయ అభివృద్ధికి ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉంటుందని మంత్రి హరీష్‌రావు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

లాభాల్లో హుస్నాబాద్ బస్‌డిపో : మేనేజర్ వెంకటేశ్వర్లు

హుస్నాబాద్, జూన్ 6, ప్రభాతవార్త : హుస్నాబాద్ బస్ డిపో నష్టాల నుండి ప్రస్తుతం లాభాల్లో నడుస్తుందని డిపో మేనేజరు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం డిపో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్టీసి ఎండి సజ్జనార్, యాజమాన్యం ఆధ్వర్యంలోతమ డిపో లాభాల బాటపట్టిందని, జూన్ 1వ తేదీ నుండి 6వ తేదీవరకు డిపో 2లక్షల 12 వేల రూపాయల లాభం సమకూర్చిందన్నారు. డిపోను మరింత లాభాల్లో నడిపించేందుకు 230 మంది ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్లను నియ మించామని, ఈ నెల 9న వారికి బాధ్యతలు అప్పగించి ప్రత్యేక కిట్లు అందిస్తా మన్నారు. వారు ప్రతీ గ్రామ సర్పంచ్‌లు,ప్రజలతో మమేకమై ఆర్టీసీ తరుపున వారికి అందనున్న సేవలను ఎప్పటికప్పుడు తెలియజేస్తారన్నారు.అదే విధంగా వివాహాది శుభకార్యక్రమాలకు ఆర్టీసి బస్సులు సరసమైన ధరలకు పంపిస్తామని,బుక్ చేసుకునే నవ దంపతులకు 500ల గిఫ్ట్‌ప్యాక్ కూడా అందిచనున్నట్లు తెలిపారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

వ్యవసాయ విస్తరణ అధికారి సబిహా

అక్కన్నపేట, జూన్ 6, ప్రభాతవార్త : వరి కొయ్యలను కాల్చొద్దని వ్యవసాయ విస్తరణ అధికారి సబిహా అన్నారు. మంగళవారం మండల కేంద్రం లో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడుతూ వర్షాకాలం సాగుకు సిద్ధమౌ తున్న రైతులు పొలంలో మిగిలిన వరికొయ్యలని కాలుస్తున్నారని ఇలా చేయడం వల్ల వాతావరణం కాలుష్యం పెరగడంతో పాటు భూసారం తగ్గి పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. రైతులు పొలంలో ఉన్న కొయ్యకాలను కాల్చేయకుండా పొలంలోనే కలియదున్నాలన్నారు. కొయ్య పొలంలో దున్నడంతో సేంద్రియ ఎరువు తయారై పంట దిగుబడి పెరుగుతుం దన్నారు. దున్నే ముందు రైతు పొలంలో సింగిల్ సూపర్ ఫాస్పెట్ చల్లితే వరికొయ్య త్వరగా మురిగి రసాయన ఎరువుల వాడకం తగ్గుతుందన్నారు.

గ్రూపు-1 పరీక్షలకు పకడ్బంధీ ఏర్పాట్లు చేయాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ శరత్

సంగారెడ్డి బ్యూరో, జూన్ 6, ప్రభాతవార్త: జిల్లాలో గ్రూపు-1 పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి గ్రూప్-1 పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో ముందస్తుసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 11 (ఆదివారం) ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1:00 వరకు గ్రూపు-1 పరీక్ష జరుగుతుందన్నారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 27 కేంద్రాలను ఏర్పాటు చేశామని, 8654 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి పరీక్షా కేంద్రాలలో పటిష్టమైన చర్యలు చేపట్టాలని, ఎలాంటి పొరపాట్లకు తావియ్యరాదని సూచించారు. కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పరీక్ష జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. పరీక్షల నిర్వహణకు లైజన్ అధికారులను నియమించడం జరిగిందని, వారు చీఫ్ సూపరింటెండెంట్‌తో పాటు పరీక్ష కేంద్రంలో ఉండి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అన్ని విషయాల్లోనూ అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు పరీక్ష కేంద్రాన్ని సందర్శించి అవసరమైన ఆయా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. చీఫ్ సూపరిండెంట్లు గైడ్లైన్స్ అన్నింటిని పున:శ్చరణచేసుకోవాలన్నారు. అభ్యర్థులు తప్పని సరిగా బయోమెట్రిక్ హాజరు ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అభ్యర్థులకు తెలిసేలా పరీక్షా కేంద్రం పేరు, పేపర్ కోడ్, ఏరియా ఆయా పరీక్ష కేంద్రం ముందు తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. ఉదయం 8:30 గంటల నుండి 10.15 నిమిషాలవరకు అభ్యర్థులను పరీక్షా కేంద్రం లోకి అనుమతిస్తారన్నారు. 10:15 గంటల తర్వాత ఎవరిని లోనికి అనుమతించరని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, సెల్‌ఫోన్లు, రైటింగ్ ప్యాడ్స్ అనుమతించరని తెలిపారు. చీఫన సూపరింటెండెంట్‌కు మాత్రమే వారి గది వరకు సెల్ ఫోన్ అనుమతి ఉందన్నారు. పరీక్షా కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు తదితర మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. చీఫ్ సూపరిండెంట్లకు, ఇన్విజిలేటర్లు 'నో రిలేషన్ సర్టిఫికెట్' ఇవ్వాలన్నారు. ముందు రోజు ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇవ్వాలని చీఫ్ సూపరిండెంట్‌లకు సూచించారు. 48 మంది అభ్యర్థులు ఉన్న గదిలో ఇద్దరు ఇన్విజిలేటర్లను వేయాలని సూచించారు. ఆయా అధికారులందరూ సమన్వయంతో పనిచేసి గ్రూపు-1 పరీక్ష సజావుగా నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఐఓ గోవిందరామ్, డీఈఓ వెంకటేశ్వర్లు, డిఆర్ఓ నగేష్, డిఎస్‌పి రవీందర్‌రెడ్డి, ఆర్డీఓ రవీందర్‌రెడ్డి, చీఫ్ సూపరిండెంట్స్, జిల్లా అధికారులు, ఎంపిడిఓలు, తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

తహసీల్దార్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న రేషన్ డీలర్లు

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి

-టీఎస్ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి పుర్రె ప్రభాకర్

కొల్చారం, జూన్ 6 ప్రభాతవార్త: రేషన్ డీలర్లకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ న్యాయమైన 21

పేదలకు అండగా కాంగ్రెస్ : పి.విజయారెడ్డి

ఖైరతాబాద్, జూన్ 6 ప్రభాతవార్త: పేదరికంలో ఉన్నటువంటి అన్ని వర్గాల ప్రజలకు కాంగ్రెస్ అండగా ఉంటోందని, ఇప్పుడు పలు సమస్యలతో సతమతమవుతున్న ప్రజలు రానున్న రోజుల్లో పలు పార్టీలకు తగిన గుణపాఠం చెబుతారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డి పేర్కొన్నారు. గతంలో ప్రజానీకానికి కాంగ్రెస్ సుస్థిరపాలనను అందిస్తూ అందరిని హక్కున చేర్చుకుందన్నారు. సముద్రం లాంటి పార్టీకి విమర్శలు షరామామూలేనంటున్నారు. మహిళలు సైతం ముందుకు వచ్చి తమను స్వాగతించడం పట్ల ప్రాధాన్యం ఉందన్నారు.

ప్రైవేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ

సికింద్రాబాద్, జూన్ 6 ప్రభాతవార్త: ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించే జర్నలిస్టుల పిల్లలకు స్కూల్ ఫీజులో 50 శాతం రాయితీ ఇవ్వాలని కోరుతూ విద్యాశాఖ అధికారులను కలిసి హెచ్‌యూజే, టీడ బ్ల్యూజేఎఫ్ బృందం వినతి పత్రం సమర్పించింది. దీనికి సానుకూలంగా విద్యాశాఖ అధికారులు సర్క్యులర్ జారీ చేసినట్లు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ (టీయూజేఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ. చంద్రశేఖర్ తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యాశాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

అనాథ శరణాలయాలకు నిత్యావసరాలు పంపిణీ

నిత్యావసర వస్తువులను పంపిణీ చేసిన దృశ్యం

చిక్కడపల్లి, జూన్ 6 ప్రభాతవార్త: ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ హైదరాబాద్ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రేణుకుంట్ల నమ:శివాయ, మడుపల్లి రవిగుప్త, కోశాధికారి మాకం బద్రీనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ ప్రాంతాలలో ఉన్న 11 అనాథ శరణాలయాలకు అవసరమైన నిత్యావసర వస్తూవులు, రామ్‌నగర్‌లోని రూ.1 ఆసుపత్రి వారికి రెండవ విడత కింద రూ.91వేల చెక్కును ముఖ్యఅతిథులుగా హాజరైన తెలంగాణ పోలీసుహౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ కొల్లేటి దామోదర్‌గుప్త, సీల్‌వెల్ కార్పొరేషన్ సిఎండి బండారు సుబ్బారావు అందించి ప్రసంగించారు. పలువురు మహిళలకు కుట్టుమిషన్‌లను కూడా పంపిణీ చేశారు. అవోపా హైదరాబాద్ చక్కటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని అభినందించారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. అవోపా పూర్వ అధ్యక్షుడు చక్రపాణి, ఉపాధ్యక్షుడు బి.సత్యనారాయణ, సహాయ కార్యదర్శి బచ్చు శ్రీనివాస్, పి.రమేశ్, బి.రమేశ్, సభ్యులు రామావతారం, సుబ్రహ్మణ్యం, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు కృషి చేస్తా : మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్ నాయి బ్రాహ్మణులతో సమావేశమైన జక్కుల మహేశ్వర్ రెడ్డి

కంటోన్మెంట్, జూన్ 6 ప్రభాతవార్త: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని వివిధ వార్డులలోని అయా బస్తీలు, కాలనీల్లో నివాసం ఉంటున్న నాయిబ్రాహ్మణులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను అందించేందుకు కృషి చేయాలని నాయి బ్రాహ్మణులు మంగళవారం కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. నాయి బ్రాహ్మణులు కులవృత్తిపై ఆధారపడిన వారిపై ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలను సక్రమంగా ఇప్పించేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నాయిబ్రాహ్మణుల సంఘం నాయకులు యాదగిరి,సాయి బాబా, గణేష్, వెంకట్, కిషన్, సుభాష్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : కొంతం దీపిక

కుమ్మరిగూడలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ కొంతం దీపిక తదితరులు

కంటోన్మెంట్, జూన్ 6 ప్రభాతవార్త: మోండా డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. మంగళవారం ఆమె డివిజన్‌లోని కుమ్మరిగూడ, చాపల బావి, నాలా పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య అస్తవ్యస్థంగా ఉందని స్థానికులు ఆమె దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులతో చర్చించి వారి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు కొంతం నరేశ్, వీరవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి.. మోండా డివిజన్ కుమ్మరిగూడలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రాజ రాజేశ్వరీ అమ్మవారి దేవాలయంలో సప్తదశ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు మోండా డివిజన్ కార్పొరేటర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాత పద్ధతిలోనే పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

టి-జాక్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం

సైఫాబాద్, జూన్ 6 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లను అమలుచేయాలని తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (టి-జెఎసి) చైర్మన్ ప్రొఫెసర్ ఇటికాల పురుషోత్తం, కన్వీనర్ ఎం.వేణు, కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పద్ధతిలోనే పెన్షన్ విధానాన్ని ప్రవేశ పెట్టాలని, ప్రస్తుతం ఈ విధానం పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, జార్ఖండ్ తదితర రాష్ట్రాలలో కొనసాగుతున్నదని తెలంగాణ రాష్ట్రంలోనూ అమలుచేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వయోపరిమితి పెంచిన విధంగానే విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న అధ్యాపకులకు 65కు పెంచాలని, అలాగే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాల్లో ఖాళీగా వున్న 2150 అధ్యాపకుల పోస్టులను భర్తీచేయాలని, అలాగే రాష్ట్రంలో ఖాళీగా వున్న విద్యావంతులైన నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అకాశాలు కల్పించాలని ఇటికాల పురుషోత్తం డిమాండ్ చేశారు.

శిష్యులను ఉద్దండులుగా తీర్చిదిద్దిన ఆచార్య ఎస్వీ రామారావు

తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి

గ్రంథాలను ఆవిష్కరిస్తున్న శ్రీదేవి, గౌరీశంకర్, ఉడదవర్లు

నాంపల్లి, జూన్ 6 ప్రభాత వార్త : తన ఎంతోమంది శిష్యులను ఉద్దండులుగా తీర్చిదిద్దిన ఆచార్య ఎస్వీ రామారావు అక్షరతపస్వి అని అభివర్ణించిన తెలంగాణ అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి ఆయన సహస్రపూర్ణ చంద్రదర్శనత్సోవం సందర్భంగా శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషానిలయంలో సాహిత్య, సాంస్కృతిక సంస్థ సాహితీ జిగీష ఏర్పాటు చేసిన గ్రంథావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై సభాధ్యక్షుడు భాషా నిలయం కార్యదర్శి టి.ఉడయవర్లు, గౌరవ అతిథి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ తదితరులతో కలిసి అక్షరదీపం గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రసంగిస్తూ రామారావు జగత్ ప్రసిద్ధులని, ఆయన కలం నుండి జాలువారిన పలు గ్రంథాలను ఉటంకించారు. అనంతరం టి.గౌరీశంకర్ తెలంగాణ వాఙ్మయ కోశం గ్రంథాన్ని ఆవిష్కరించి అందులోని విషయాలను విశదీకరించారు. చివరిగా ఆచార్య ఎస్.వి.రామారావును ఘనంగా సత్కరించారు.

కళా సాహిత్య కేంద్రం త్యాగరాయ గానసభ

గాయనీ మంజులను సత్కరిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి, జూన్ 6 ప్రభాతవార్త: కళలకు కేంద్రం త్యాగరాయ గానసభ అని ఘంటసాల గానసభ అధ్యక్షుడు డాక్టర్ కె.వి.రావు అన్నారు. సంగీత నృత్య నాటక సాహిత్య కార్యక్రమాలకు నిలయంగా ఉందనాన్నరు. త్యాగరాయ గానసభ స్థాపించి 58 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా త్యాగరాయ కీర్తనల గాన కార్యక్రమం గానసభ అధ్యక్షుడు కళావిఎస్.జనార్దనమూర్తి అధ్యక్షతన గానసభలోని కళాలలిత కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ కె.వి.రావు మాట్లాడుతూ జంటనగరాలలోనే కాక దేశవ్యాప్తంగా పేరు పొందిందని అన్నారు. సాధారణంగా కళావేదికలు సాంస్కృతిక కార్యక్రమాలకు నిలయాలుగా కాని గానసభ కళాప్రదర్శనలకే కాకుండా పేదవర్గాల వారికి వివాహాల కోసం సహకరించడ, వైద్య శిబిరాల నిర్వహణ వంటి సేవా కార్యక్రమాలు చేయడం విశేషమన్నారు. ఈ కార్యక్రమంలో హాస్యావధాని శంకర్‌నారాయణ, గానసభ జీవిత సభ్యులు శంకర్‌ప్రసాద్, సంగీత గురువు కోనేరు మంజుల తదితరులు పాల్గొన్నారు. మంజుల శిష్యబృందం త్యాగరాజ కీర్తనలు ఆలపించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలను తక్షణమే నిలిపివేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఆకుల శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, జూన్ 6,ప్రభాతవార్త: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలను తక్షణమే నిలిపవేయాలని కనీస వేతన చట్టం అమలు చేసిన పూర్తిస్థాయిలో పిఎఫ్ చెల్లించాలని ఎస్‌బిఐ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈమేరకు మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమైన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కి వినతిపత్రం అందజేసి అనంతరం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జాతీయ అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్‌బిఐ యాజమాన్యం ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో వేతనాలు చెల్లించకుండా జీతాలలో కోత, పిఎఫ్ చెల్లింపుల్లో కోత విధిస్తుండటం వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 12గంటల పాటు పనిచేయించుకోవడంతోపాటు ఒకబ్రాంచి నుంచి మరొక బ్రాంచికి బలవంతంగా బదిలీలు చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 4వేలమంది కాంట్రాక్ట్ ఉద్యోగులు పనిచేస్తున్నారని వారికి ఔట్‌సోర్సింగ్‌గా తీసుకని స్కిల్డ్ వర్క్ చేయించుకుంటున్నారని వారి సర్వీస్‌ను తక్షణమే క్రమబద్ధీకరించి వారిని ట్రాన్స్‌ఫర్స్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో స్టేట్ ప్రెసిడెంట్ కిశోర్, సెక్రటరీ కె.అశోక్, వైస్ ప్రెసిడెంట్ రాజు, ఎన్.రవి తదితరులు పాల్గొన్నారు.

సిఎం కెసిఆర్ ఆశించిన అభివృద్ధి అంబర్‌పేటలో జరగడంలేదు

ఎడ్ల సుధాకర్‌రెడ్డి

అంబర్‌పేటలో మీడియాతో మాట్లాడుతున్న ఎడ్ల సుధాకర్‌రెడ్డి, చిత్రంలో గరిగంటి రమేష్, పులి జగన్, కె.మురళీకృష్ణ తదితరులు

హైదరాబాద్, జూన్ 6 ప్రభాతవార్త : అంబర్‌పేట నియోజకవర్గంలో సిఎం కెసిఆర్ ఆశించిన విధంగా అభివృద్ధి జరగడం లేదని నియోజకవర్గం బిఆర్ఎస్ ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం అంబర్‌పేట చేనెంబర్ చౌరస్తాలోని బిఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ రాష్ట్రం నెంబర్ వన్‌గా నిలిచిందన్నారు. సిఎం కెసిఆర్ కీర్తి ప్రతిష్టలు దేశంలో మారుమ్రోగుతున్నా యని అన్నారు. సిఎం కెసిఆర్ అమలు పరుస్తున్న సంక్షేమ అభివృద్ధి పనులు అంబర్‌పేటలో ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతున్నారని విమర్శించారు. అంబర్‌పేటలో ఎమ్మెల్యే మనుషులు రౌడీయిజం, అరాచకం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే అందర్ని కలుపుకొని పోవడంలేదన్నారు. తెలంగాణ దశాబ్ధి వేడుకలకు కూడా ఎమ్మెల్యే పిలవడంలేదన్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు కాకుండా అంబర్‌పేట నియోజకవర్గంలోని మాజీ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్లు, ఉద్యమకారులతో కలిసి సిఎం కెసిఆర్ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్తుతున్నామని చెప్పారు.

చేతులారా పార్టీని నాశనం చేస్తున్నారు: గరిగంటి రమేష్

అంబర్‌పేటలో చేతులారా పార్టీని నాశనం చేస్తున్నారని బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు గరిగంటి రమేష్ అన్నారు. పార్టీ ఒకరి సొత్తు కాదు. అందరూ కలిస్తేనే పార్టీ. అంబర్‌పేటలో ఒక్కతాటిపై ఉన్న పార్టీని ఎమ్మెల్యే కారణంగా గ్రూపులుగా చీలిపోయిందన్నారు. నాటి టిఆర్ఎస్ ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్‌రెడ్డి నాయకత్వంలో జిహెచ్ఎంసి ఎన్నికల్లో అంబర్‌పేట సెగ్మెంట్లోని ఐదు డివిజన్లలో ఐదు స్థానాలు టిఆర్ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. కాలేరు వెంకటేష్ ఎమ్మెల్యే ఎన్నికయ్యాక జరిగిన ఎన్నికల్లో ఐదు డివిజన్లలో కేవలం రెండు స్థానాలకే పరిమితం అయిందని విమర్శించారు. అంబర్‌పేటలో ప్లెక్సీలను చింపివేస్తున్నారని, ప్లెక్సీలను కట్‌చేయించినవారికి రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం పడుతుందన్నారు. పార్టీ ఇన్‌చార్జీ ఎడ్ల సుధాకర్‌రెడ్డి పైరవీకారుడు కాదు. మచ్చలేని మనిషి, ఆయన నాయకత్వంలో పనిచేస్తాం. అంబర్‌పేటకు ఆయనే సరైన నాయకుడని గరిగంటి రమేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పులి జగన్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకురాలు నాగేష్‌గౌడ్, కె.మురళీకృష్ణ, డాక్టర్ సులోచన, సుశీలారెడ్డి, దేవిరెడ్డి విజితారెడ్డి, జెడి రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం దేశానికే ఆదర్శం: మంత్రి తలసాని

జ్ఞాపికలను అందిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, చిత్రంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, డిఐసి జనరల్ మేనేజర్ పవన్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి, జూన్ 6 ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం దేశానికే ఆదర్శనీయంగా నిలిచిందని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని విఎస్టీ వర్కర్స్ యూనియన్ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని ముషీరాబాద్ ఎమ్మెల్యేముఠాగోపాల్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రసంగించారు. ముందుగా తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావంకు ముందు పరిశ్రమల పరిస్థితి, తెలంగాణ రాష్ట్ర వచ్చిన తర్వాత జరిగిన అభివృద్ధిని వివరించే లఘుచిత్ర ప్రదర్శన జరిగింది. అనంతరం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ ఒక్క పరిశ్రమలే కాకుండా ఐటి రంగం అభివృద్ధికి కకూడా ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుందని, ప్రపంచంలో అత్యంత ప్రముఖ కంపెనీలైన అమెజాన్, గూగుల్, యాపిల్ వంటి కంపెనీలు హైదరాబాద్‌లో తమ సంస్థలను ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సిఎం కెసిఆర్ ఆధ్వర్యంలో నూతన పరిశ్రమల ఏర్పాటు కోసం ప్రభుత్వం టిఎస్ ఐపాస్ తీసుకొచ్చిదని, అదే కాకుండా పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన విద్యుత్తు సరఫరా, నీరు తదితర వనరులు కూడా ప్రభుత్వం కల్పించడం, పరిశ్రమల శాఖ మంత్రి కెటిఆర్ ప్రత్యేక కృషితో విదేశీ సంస్థలతో సంప్రదింపులు జరిపిన కారణంగా పెద్దఎత్తున పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకొస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేర్ పవన్‌కుమార్, ఆర్‌డిఓ వసంత, ఎస్సీ కార్పొరేషన్ ఈడి రమేశ్, డిక్కి అధ్యక్షుడు రవికుమార్, శ్రీనివాస్, సిద్ధార్థ గోయల్. బిఆర్ఎస్ యువనేతముఠాజైసింహా, మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి పైపు లైను నిర్మాణ పనులు పరిశీలించిన కార్పొరేటర్

అల్వాల్, జూన్ 6 ప్రభాతవార్త: ప్రజలకు మంచినీటి సమస్యలు రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శ్రీ లక్ష్మీనగర్ కాలనీలో నిర్మాణంలో ఉన్న మంచినీటి పైపులైన్లు పనులను జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ పరిశీలించారు. వర్షాలు పడే లోపు పనులు పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ మల్లిఖార్జున్, శేఖర్, రాజేశ్వరరావు, రాజసింహారెడ్డి, కరణ్ ఇతరులు పాల్గొన్నారు.

సమస్యలు తీర్చండి: బిజెపి

అల్వాల్, జూన్ 6 ప్రభాతవార్త: అల్వాల్ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరుతూ డిప్యూటీ కమీషనర్ నాగమణికి భారతీయ జనతాపార్టీ నేతలు వినతి పత్రం అందించారు. మంగళవారం మల్కాజిగిరి నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ సదానంద్ గౌడ్ సీనియర్ నేత దండుగుల వెంకటేష్ నేతృత్వంలో డిసిని కలిశారు. డ్రైనేజి, రోడ్లు, విద్యుత్ దీపాలు వ్యవస్థలు అస్తవ్యస్థంగా ఉన్నాయని డిసికి వివరించారు. డబుల్ బెడ్ రూములు, పించన్‌లు, దళిత బందు, ఉచిత మంచినీటి సరఫరా వంటి వాటిని అమలు చేయాలన్నారు. దోమలు, కుక్కలు బెడద నుంచి ప్రజలను కాపాడాలని వినతి పత్రంలో కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కార్తీక్ గౌడ్, రవి కిరణ్, నేతలు వాసం శెట్టి శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సంతోష్ గౌడ్, శేఖర్, లక్ష్మణ్, మల్లిఖార్జున్ యాదవ్, మాచర్ల శ్రీనివాస్ మల్లిఖార్జున్ గౌడ్ సుజాత, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

బస్తీలలో పాదయాత్ర నిర్వహిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

హౌసింగ్ బోర్డు కాలనీలో కార్పొరేటర్ పాదయాత్ర

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 6 ప్రభాతవార్త : మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మంగళవారం స్థానిక కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు.స్థానిక బస్తీ వాసులు నుంచి బస్తీ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హౌసింగ్ బోర్డు కాలనీలో సిసి రోడ్లువీధి దీపాలతో పాటు ఇతర మౌళిక సదుపాయాలు కల్పన కోసం తన శాయ శక్తుల కృషి చేస్తానని తెలిపారు.శ్రీ కాంత్‌రెడ్డి, జమ్మన్న, బలరామ్, ప్రసాద్, నారాయణ, టి.సుధాకర్‌రెడ్డి, టి.చిన్న,వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్‌తో పాటు పలువురు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌కు గురైన చిన్నారిని కాపాడబోయి మహిళ మృతి

మూసాపేట, జూన్ 6, ప్రభాతవార్త : విద్యుత్ షాక్‌కు గురైన చినారిని కాపాడేందుకు ప్రయత్నించిన ఓ మహిళ మృత్యు వాతపడిన సంఘటన కెపిహెచ్‌బి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆడ్డగుట్ట ఎలిగేన్స్ ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్‌గా పని చేస్తున్న శ్రీను తన భార్య ఇద్దరు కూతుళ్ళతో కలిసి నివసిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం శ్రీను బంధువుల అమ్మాయి మహాలక్ష్మీ అతని కూతుళ్ళతో ఆడుకోవడం కోసం అపార్ట్‌మెంట్ వెనకాల ఉన్న చెట్టు దగ్గరకు వెళ్ళారు. మహాలక్ష్మి (5) ఆడుకుంటూ చెట్టును పట్టుకోవడంతో అప్పటికే కేబుల్స్ తగిలి చెట్టుకు విద్యుత్ ప్రవహిస్తుండటంతో చిన్నారికి షాక్ కొట్టింది. మహాలక్ష్మీ అరుపులు విని వాచ్‌మెన్ శ్రీను, అతని భార్య బాపణమ్మ చిన్నారిని కాపాడేందుకు ప్రయత్నం చేశారు. చిన్నారిని కాపాడే ప్రయత్నంలో బాపణమ్మ షాక్ గురై మృతి చెందగా, చిన్నారి గాయపడింది. స్థానికులు చిన్నారిని చికిత్స నిమిత్తం తరలించగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

మంచినీటిఎద్దడిని పరిష్కరించడానికి చర్యలు

ఎమ్మెల్యే ముఠాగోపాల్

చిక్కడపల్లి, జూన్ 6 ప్రభాతవార్త: ముషీరాబాద్ నియోజకవర్గంలో మంచినీటి ఎద్దడి పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు స్థానిక ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని లంబాడితండ డబుల్‌రూమ్ భవనాల సముదాయం ఆవరణంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమాన్ని బస్తీ సంఘం అధ్యక్షుడు వి.కల్యాణ్ నాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఆర్వో ప్లాంట్ ఏర్పాటు ద్వారా ప్రజలకు పరిశుద్ధమైన మంచినీటిని అందుబాటులోకి తీసుకురావడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ సంఘం నాయకులు దేవేందర్ నాయక్, హరి, బాలు తదితరులు పాల్గొన్నారు.

వసూళ్లే లక్ష్యంగా మాల జెఏసీలు

మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పి.శ్రీకృష్ణ, శంకర్

నాంపల్లి, జూన్ 6 ప్రభాతవార్త : మాలల పేరుతో జెఏసీలు ఏర్పాటు చేసి కేవలం పాలక, ప్రతిపక్ష పార్టీలు, ఇతర వ్యక్తులు, సంస్థల నుండి లక్షలాది రూపాయలు వసూలు చేయడానికి తప్ప ప్రయోజనం ఏదీలేదని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ మంగళవారం మధ్యాహ్నం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో తీవ్రంగా విమర్శించారు. గతంలో మాలల గర్జన పేరుతో మాలల కోసం చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. నాటు బిజెపి నిధులతో పెట్టిన బహిరంగసభ విఫలం కావడంతో మళ్లీ మాలల జెఏసీ అంటూ కొందరు తెరమీదకొచ్చి అమాయకులైన మాలలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. మాలమహానాడు బృందం తెలంగాణ రాష్ట్ర ఎస్సీ సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి ఎస్సీల బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీ, దళితబంధు, మాల భవనానికి సంబంధించిన అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మచ్చపోతుల శంకర్, కార్యదర్శి బిల్లం మహేందరన, జెట్టి కుర్మయ్య, సంకి ప్రసాద్, మద్దెల అర్జున్, అనిల్‌కుమార్, గణేష్, శ్రీధర్, రాజు తదితర నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగుతో అంధత్వ రహిత తెలంగాణ సాధ్యపడుతుంది

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్

బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్‌లోని 11.వ,వార్డులో కంటి వెలుగు కేంద్రంలో ఓ మహిళకు అద్దాలు అందజేస్తున్న మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, జూన్ 6 ప్రభాతవార్త : అంధత్వ రహిత తెలంగాణగా మార్చేందుకు సీఎం కేసీఆర్ గ్రామ గ్రామాన కంటి వెలుగు కేంద్రాలను ఏర్పాటు చేయిస్తున్నారని బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం కార్పొరేషన్‌లోని 11.వ,వార్డులో నూతనంగా కంటి వెలుగు కేంద్రంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వైద్యంలో నిష్ణాతులైన డాక్టర్లతో ప్రజల కళ్లకు పరీక్షలు జరిపి, అవసరమైన వారికి ఉచితంగానే మందులు, అద్దాలు ఇస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరూ ఆరు నెలలకు ఓ సారి తమ కంటి చూపును పరీక్షించుకోవాలని సూచించారు. గ్లూకోమా వంటి వ్యాధి కంటికి సోకితే చూపును తిరిగి తెచ్చుకునే అవకాశం

ఎమ్మెల్సీ కవితను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

ఎమ్మెల్సీ కవితను కలిసిన బిఆర్ఎస్ నాయకులు

కొమురవెల్లి, జూన్ 6, ప్రభాతవార్త : భారత్ జాగృతి అధ్యక్షురాలు, నిజామాబాద్ శాసన మండలి సభ్యులు(ఎమ్మెల్సీ) కల్వకుంట్ల కవితను మంగళవారం హైదారాబాద్‌లోని అమె స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసినట్లు బిఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏర్పుల మహేష్ తెలిపారు. మండల కేంద్రంలోని శ్రీ కొమురవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి రావాలని విజ్ఞప్తి చేయగా వెంటనే స్పందించి త్వరలోనే స్వామి వారి దర్శనానికి వస్తానని కవిత తెలిపినట్లు అయన తెలిపారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపుకోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాలని సూచించినట్లు అయన వివరించారు.

రాయపోల్ మండలంలో ఎమ్మెల్యే పర్యటన

అంకిరెడ్డిపల్లిలో రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

రాయపోల్, జూన్ 6 ప్రభాతవార్త: మండలంలో మంగళవారం దుబ్బాక ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు పర్యటించారు. మండల పరిధిలోని కొత్తపల్లిలో ఇటీవల మృతి చెందిన ఎర్రోల్ల లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసారు. అదేవిధంగా అంకిరెడ్డిపల్లిలో ఇటీవల మృతి చెందిన పల్పూరి మల్లారెడ్డి కుటుంబాన్ని ఆయన పరామర్శించారు. ఆనంతరం అంకిరెడ్డిపల్లి నుండి రాంసాగర్ వరకు ఎస్‌డిఎఫ్ నిధులతో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట అంకిరెడ్డిపల్లి సర్పంచ్ వెంకటనర్సింహారెడ్డి, బిజెపి మండల అధ్యక్షులు మాదాసు వెంకట్‌గౌడ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు మంకిడి స్వామి, దయాకర్‌రెడ్డి, కొంగరి స్వామి, రాజిరెడ్డి, గొల్ల రాజు సతీష్, సుఖేందర్‌రెడ్డి, రాజు, నరేష్‌గౌడ్, సాయి, స్వామి ఉన్నారు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న శశిధర్‌శర్మ

జగదేవ్‌పూర్, జూన్ 6 (ప్రభాతవార్త): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని పిఆర్‌టియు సంఘం జిల్లా అధ్యక్షుడు ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మునిగడప ఉన్నత పాఠశాల పరిధిలోని మాందాపూర్ గ్రామంలో పర్యటించి ఇంటింటికి తిరుగుతూ మనబడి పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో కల్పించబడుతున్న వసతుల గురించి వివరించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. అదేవిధంగా ఈ విద్యా సంవత్సరం నుండి విద్యార్థులకు ఉదయం రాగి జావ అందించాలని ముఖ్యమంత్రి కెసిఆర్ తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎండి.రహీం, స్థానిక సర్పంచ్ బిక్షపతి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటుంది

-రాష్ట్ర ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

వర్గల్, జూన్ 6 (ప్రభాతవార్త): బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని రాష్ట్ర ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని జబ్బాపూర్ గ్రామానికి చెందిన పయ్యావుల స్వామి గత కొన్ని రోజుల క్రితం నీటిలో మునిగి మృతిచెందగా అతనికి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో రూ.2 లక్షల బీమా చెక్కు మంజూరు కాగా అట్టి చెక్కును మంగళవారం మృతుని భార్య పయ్యావుల రాణికి వంటేరు ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ అందజేస్తున్న బీమా కార్యకర్తల కుటుంబాలకు ధీమాగా ఉంటుందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి బిఆర్ఎస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బాలు యాదవ్, ఎంపిపి లతా రమేష్‌గౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు నాగరాజు, మండల బిసిసెల్ అధ్యక్షుడు మురళీగౌడ్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి దయతో అందరూ సుఖంగా ఉండాలి

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు

ఎమ్మెల్యేను సత్కరిస్తున్న గౌడ సంఘం నాయకులు

మిరుదొడ్డి, జూన్ 6,ప్రభాతవార్త : మండలంలోని కాసులాబాద్‌లో గౌడ సంఘం అధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ సిద్ధివియోగ మహోత్సవంలో మంగళవారం దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గౌడ సంఘం నాయకులు పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో అందరూ సుఖ:సంతోషాలతో ఉండాలని అకాంక్షించారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో బాలగౌడ్, బిజెపి నాయకులు దేవరాజు, మల్లన్నగారి బిక్షపతి, అశయ్యతో పాటు గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మేడపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక అక్షరాభ్యాసం

యాచారం, జూన్ 6 ప్రభాతవార్త: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మేడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన, సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సీడీపీవో శాంతిశ్రీ, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులందరినీ అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారం అందించడంతోపాటు ఆట, పాటద్వారా విద్యనందిస్తారని, ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నిరకాల వర్క్‌బుక్స్ ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి శివలీల పాల్గొన్నారు.

యువత ఆటలతోపాటు రన్నింగ్, ధ్యానం చేయాలి

ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

జగదేవ్‌పూర్, జూన్ 6 (ప్రభాతవార్త): తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మంగళవారం మండల పరిధిలోని మునిగడప గ్రామంలో ఎంపిటిసి, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కారింగుల కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో యువకులకు 3కె రన్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జగదేవ్‌పూర్ ఎస్ఐ కృష్ణమూర్తి హాజరై జెండా ఊపి 3కె రన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, యువకులు ప్రతి రోజూ శరీర దారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి ఆటలతో పాటు యోగా, రన్నింగ్, ధ్యానంలాంటివి చేయాలన్నారు. యువకులలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికి తీసి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో రాణించేలా నాయకులు సహకరించాలన్నారు. 3కె రన్‌లో విజేతగా నిలిచిన వారికి రూ.5వేల బహుమతిని ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి అందజేశారు.

అనంతరం ముఖ్య అతిథు లకు ఫీల్డ్ అసిస్టెంట్ బాబు శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బాల్‌లక్ష్మి ఐలయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు లింగాల బిక్ష పతి, శ్రీపతి రాజేశ్వరి రవి, రావికంటి చంద్రశేఖర్ గుప్త, పిఎసిఎస్ డైరెక్టర్ భూమయ్య, నాచారం ఆలయ డైరెక్టర్ బుద్ధ నాగరాజు, బిఆర్ఎస్ మం డల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, స్థానిక ఉప సర్పంచ్ లావణ్య మల్లేశం, యువకులు నర్సింలు, కళ్యాణ్, రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రత్యేక అధికారి విజయశేఖర్‌తో మాట్లాడుతున్న సర్పంచ్‌లు

నిధులు ఇవ్వకుండా చెరువుల పండుగ ఎలా జరపాలి?

చిన్నశంకరంపేట, జూన్ 6, ప్రభాతవార్త: చేసిన అభివృద్ధి పనులకు నిధుల ఇవ్వకుండా చెరువుల పండగ ఎలా జరపాలని మండల సర్పంచిలు, మండల ప్రత్యేక అధికారి విజయశేఖర్‌ను ప్రశ్నించారు. మంగళవారం చిన్నశంకరంపేటలో వివిధ గ్రామాల సర్పంచ్‌లతో ఆయన మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చెరువుల పండగను నిర్వహించాలని అధికారులు సర్పంచిలకు తెలిపారు. నిధుల ఇవ్వకుండా పనులు ఎలాచేయాలని, నిధులు ఇవ్వనిది ఎలాంటి కార్యక్రమాలను చేపట్టేదిలేదని సర్పంచిలు తేల్చిచెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మణ్,సాయిలు,దయానంద్,శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

వికలాంగుల ధర్నాకు తరలిరావాలి

కరపత్రాలను విడుదలచేస్తున్న వికలాంగుల హక్కుల పోరాట సమితి నేతలు

చిన్నశంకరంపేట, జూన్ 6, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం వికలాంగులకు పెన్షన్‌ను పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు పాండు డిమాండ్ చేశారు. మంగళవారం వారు చిన్నశంకరంపేట పట్టణంలో మాట్లాడుతూ 8న జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించే ధర్నాకు వికలాంగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి విహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరు కానున్నట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం ధర్నా కరపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దత్తు, శంకర్,నర్సింలు,భూమయ్య,మల్లేషం పాల్గొన్నారు.

సన్మాన సభను జయప్రదం చేయండి

-జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు రాంచెందర్ యాదవ్

పూడూరు, జూన్ 6, ప్రభాతవార్త : ఈ నెల 8వతేదీన జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత,హైకోర్టు న్యాయవాది కడుమూరి ఆనందంను పరిగి పట్టణంలో సన్మానించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వికారాబాద్ జిల్లా ఉప సర్పంచుల సంఘం అధ్యక్షుడు,జాతీయ బిసి సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భేరి రాంచెందర్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు.హైకోర్టు న్యాయవాది కడుమూరి ఆనందంకు జాతీయ అంబేధ్కర్, దళిత రత్న అవార్డులు వచ్చిన సందర్భంగా గురువారం సాయంత్రం 4గంటలకు పరిగి పట్టణంలోని కోడంగల్ చౌరస్తా నుండి ఎబిఎస్ ఫంక్షన్‌హాలు వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎబిఎస్ ఫంక్షన్‌హాలులో జరిగే సన్మానసభకు జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు, ఎపి రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య,స్థానిక ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి,ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగ,డిసిసిబి చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి,బిఎస్‌పి రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీన్ కుమార్, మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్,మాజీ ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, కెఎస్ రత్నం ముఖ్య అతిథులుగా హాజరవుతారని వివరించారు.ఇట్టి కార్యక్రమానికి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు,ప్రజా సంఘాలు,ప్రజలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి

మేడ్చల్, జూన్ 6 ప్రభాతవార్త : కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏఐటియూసి రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు యూసఫ్, యజ్ బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేడ్చల్ పట్టణంలోని జంగ లక్ష్మయ్య కళ్యాణ మండపంలో 3వ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో బారీ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ప్రభుత్వ ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలపై ఏఐటి యూసి నిరంతర పోరాటం చేసి, వారి ఉద్యమానికి నాయకత్వం వహించిదని అన్నారు. మున్సిపల్ రంగంలో చాలీ చాలనీ వేతనాలతో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేసి కనీస వేతనాన్ని రూ 26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ చేస్తామని ఉద్యమ సహాయంలో హమి ఇచ్చిన సీఎం కేసీఆర్ ఇంతవరకు అమలు చేయడం లేదని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అనంతరం 10 వ పీఆర్సీ వేతన సవరణ అమలు చేయకపోతే నిరసనలు చేపడుతామని వారు అన్నారు.

విజయవంతంగా ముగిసిన కంటి వెలుగు శిబిరాలు

కంటి వెలుగు సిబ్బందికి సన్మానం చేస్తున్న దృశ్యం

మిరుదొడ్డి, జూన్ 6, ప్రభాతవార్త : మిరుదొడ్డి ప్రాథమిక అరోగ్య కేంద్ర పరిధిలో నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. పిహెచ్‌సి పరిధిలోని 10 గ్రామ పంచాయతి పరిధిలో జనవరి 19 నుంచి ప్రారంభించిన కంటి వెలుగు శిబిరాలు మంగళవారంతో ముగిశాయి. 16333 మంది లక్ష్యంగా కాగా 11815 మంది కంటి పరీక్షలు నిర్వహించినట్లు డాక్టర్ సమీనా సుల్తానా, క్యాంపు మెడికల్ అఫీసర్ నీలోఫర్ తెలిపారు. 2146 మందికి కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. 2491 మందికి కంటి అద్దాల కోసం అర్డర్ చేయడం జరిగిందన్నారు. వీటిలో 1802 అద్దాలు రాగా వాటిని లబ్దిదారులకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇంకా 689 మందికి అద్దాలు రావాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా కొంత మందిని మోతె బిందు అపరేషన్‌కు గుర్తించామని తెలిపారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కంటి వెలుగు బృ ందానికి పిహెచ్‌సిలో ఘన సన్మానం చేశారు.

ప్రతి ధాన్యం గింజ కొంటాం

-డిసిసిబి చైర్మన్ మనోహర్‌రెడ్డి

చౌడాపూర్ జూన్6,ప్రభాతవార్త :

మండల పరిధిలోని చౌడాపూర్,కల్మన్ కాల్వ,మరికల్ గ్రామాల లో మంగళవారం ఉమ్మడి జిల్లా డిసిసిబి చైర్మన్ మనోహర్ రెడ్డి వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.మండల పరిధిలో సొసైటి ద్వారా నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలలో ఆకస్మిక తనిఖీ నిర్వహించి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని సత్వర పరిష్కారానికి చర్యల దిశగా కృషి చేస్తానని రైతులకు భరోసాని ఇచ్చారు.వాహనాల కొరత,వరి బస్తాల నిల్వకు స్థలం లేకపోవడంతో వడ్ల కొనుగోలు కేంద్రాల్లోనే రైతు పండించిన ధాన్యం బస్తాలు ఉంటున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేయగా సానుకూలంగా స్పందించిన మనోహర్ రెడ్డి అధికారులతో మాట్లాడారు..తిరుమలాపూర్‌లోని పిఎసిఎస్ ఆధ్వర్యంలో దాదాపు 2300 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో నూతనంగా నిర్మించిన గోదాంలో ఉచితంగా నిల్వ చేసుకునేం దుకు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.రైతులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చివరి ధా న్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని అన్నం పెట్టే రైతన్నల కు అండగా నేనుంటానని డిసిసిబి చైర్మన్ మనోహర్ రెడ్డి రైతులకు భరోసానింపారు.ఈ కార్యక్రమంలో సొసైటి వైస్ చైర్మన్ నాగరాజు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు పట్టివేత

ధారూర్, జూన్ 6 ప్రభాతవార్త : ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం పోలీసు లు పట్టుకున్నారు.ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ....ధారుర్ మండలంలోని పలుచోట్ల తనిఖీలు చేస్తుం డగా అంపల్లి చౌరాస్త వద్ద ట్రాక్టర్ టిఎస్ 34 జి 98800, అలాగే నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద మరో ట్రాక్టర్ టిఎస్ 34 జి 6381 తనిఖీ చేయగా ఇసుకకు సంబం ధించిన ఎలాంటి ధ్రువీకరణ పత్రాల లేకపోవడంతో పోలీస్ స్టేషన్ తరలించి ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసిన ట్లు ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు.ఎవరైనా చట్టానికి వ్యతి రేకంగా అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై సంతోష్ కుమార్ హెచ్చరించారు.

వెంకటయ్యకు దళితరత్న అవార్డు రావడం అభినందనీయం

పూడూరు, జూన్ 6 ప్రభాతవార్త : సమాజసేవకు అంకితమైన వెంకటయ్యకు దళితరత్న ఆవార్డు రావడం అభినందనీయమని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసి బి చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు.సామాజిక సే వా కార్యక్రమాలు చేసినందుకు గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన దళితరత్న అవార్డు గ్రహీత వెంకటయ్య ను మంగళవారం పూడూరు మండలంలోని దేవనోనిగూడలో వివిధ గ్రామాల నాయకులతో కలిసి శాలువా,పూలమాలలతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల సమాచార హక్కు చట్టం కన్వీనర్‌గా,ప్రజా సేవలో భాగంగా విద్యా,వైద్యం,సామాజిక రంగంలో ప్రజలను చైతన్యవంతులను చేసినందుకు గుర్తింపుగా ఈ అవార్డులకు గ్రామీణ ప్రాంతానికి చెందిన వెంకటయ్య ఎంపికవ్వడం సంతోషకరమ న్నారు.సామాజిక సేవా రంగాల్లో పాల్గొనే వారికి తెలంగాణ ప్ర భుత్వం మంచి గుర్తింపునిస్తుందని పేర్కొన్నారు.ఇలాంటి సేవా కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా ఇలాగే కొనసాగించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు గంగాధర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, శ్రీశైలంగౌడ్, భాస్క ర్‌రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, నర్సింలు,సిరాజ్,బాలమణి పాల్గొన్నారు.

నిరాహారదీక్షలు చేస్తున్న జేఏసీ నాయకులు, మున్నూరుకాపు నాయకులు

72వ రోజుకు చేరిన రెవెన్యూ డివిజన్ దీక్షలు

మెదక్, జూన్ 5, ప్రభాతవార్త : రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ జేఏసీ ఆధ్వర్యంలో చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 72వ రోజుకు చేరుకున్నాయి. ఈరోజు మున్నూరుకాపు సంఘం నాయకులు, సభ్యులు మద్దతు తెలియజేసి రిలే దీక్షలో కూర్చున్నారు. అనంతరం అఖిలపక్షం నేతలు, మున్నూరుకాపు సంఘం పెద్దలు మాట్లాడుతూ అన్ని అర్హతలు ఉన్న రామాయంపేటను వెనువెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులతో పాటు మున్నూరు కాపు సంఘం పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాలలో మెరుగైన విద్యాబోధన

విద్యార్థులను ప్రభుత్వ కళాశాలలో చేరాలని వివరిస్తున్న అధ్యాపకులు

మెదక్, జూన్ 5, ప్రభాతవార్త : రామాయంపేట పట్టణంలోగల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన విద్యాబోధన లభిస్తుందని జూనియర్ లెక్చరర్లు చెప్పారు.మంగళవారం రామాయంపేట పట్టణంతోపాటు అక్కన్నపేట, కోనాపూర్, నందిగామ, లక్ష్మాపూర్, తొనిగండ్ల గ్రామాలలో లెక్చరర్లు పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. పదవ తరగతి పాసైన విద్యార్థుల ఇంటివద్దకు వెళ్లి ప్రభుత్వ కళాశాల వివరాలను వారికి వెల్లడించారు. అనుభవంగల అధ్యాపకులచే మెరుగైన విద్యాబోధన అందించడం జరుగుతుందని చెప్పారు. కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థికి ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందజేయడంతో పాటు బస్సు సౌకర్యం, ఉపకార వేతనాలు అందించడం జరుగుతుందని తెలిపారు. కళాశాలలో చదివిన సైన్స్ ఒకేషనల్ విద్యార్థులు ఎంసెట్లో ర్యాంకులు సాధించి జిల్లాకు ఆదర్శంగానిలిచారని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు మల్లేశం, ఆంజనేయులు, సురేందర్‌రెడ్డి, యాదగిరి, నర్సింలుగౌడ్, శ్రీనివాసచారి, స్వామి, బాలగౌడ్ ఉన్నారు.

చెరువుల పండుగకు రూ.3 లక్షల విరాళం

మాట్లాడుతున్న సర్పంచ్‌లు

మర్కుక్, జూన్ 6 (ప్రభాతవార్త): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలలో భాగంగా మండలంలోని 15 గ్రామపంచాయతీలకు గానూ ఊరు చెరువుల పండుగ కోసం మాజీ జెడ్‌పిటిసి సింగం సత్తయ్య రూ.3 లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు అప్పాల ప్రవీణ్ మాట్లాడుతూ సిఎం కెసిఆర్ పిలుపు మేరకు ప్రతి గ్రామంలో చెరువులవద్ద సహపంక్తి భోజనాలు ఏర్పాటుచేసి పండుగ జరుపుకుంటున్నామని, ఇందులో భాగంగా మాజీ జెడ్‌పిటిసి సింగం సత్తయ్య రూ.3 లక్షల విరాళం అందజేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు వివిధ గ్రామాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే నిధులకు అదనంగా ప్రతి గ్రామానికి సుమారు రూ. 20 వేలు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు భాస్కర్, గడ్డం ప్రసాద్, నర్సింలు, అశోక్, నాయకులు శ్రీరామ్, రాజిరెడ్డి, నర్సింలు, సుధాకర్‌రెడ్డి, రాములుగౌడ్, మల్లేశం, నర్సింలు, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్‌డి ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 6 ప్రభాతవార్త: ఎస్ఎఫ్‌డీ మెదక్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం మెదక్ పట్టణంలోని ఐటీఐ కళాశాలలో ప్లాస్టిక్‌పై అవగాహన సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశంలో ఎస్ఎఫ్‌డీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్ఎఫ్‌డీ ఈ సంవత్సరం ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కారం అనే థీమ్‌తో ప్లాస్టిక్‌పై అవగాహన కల్పించాలని నిర్ణయించిందన్నారు. ఎస్ఎఫ్‌డీ జాతీయ శాఖ వారంరోజులపాటు పలు రకాల కార్యక్రమాలు, ర్యాలీలు, సెమినార్‌లు, ఎకో బ్రిక్స్ అవగాహన, ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన కల్పించాలని నిర్ణయించడం జరిగిందన్నారు. అలాగే సమావేశంలో విద్యార్థులతో చర్చించడం జరిగింది. అందులో విద్యార్థులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం విషయంలో సరైనటువంటి నిబంధనలను ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. యువత ఈ విషయంపై అవగాహన పొంది సమాజంలోని వ్యక్తులందరికీ అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్‌డీ జిల్లా కన్వీనర్ ఉదయ్ చారి, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ శశికాంత్, మనోజ్ కుమార్, దినేష్, హరీష్, శిల్ప, రూప తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ మందిర్ నిర్మాణానికి విరాళం

ధారూర్, జూన్ 6 ప్రభాతవార్త : ధారుర్ మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో హనుమాన్ మందిర్ నిర్మాణానికి జడ్పిటిసి కొస్నం సుజాత వేణుగోపాల్ రెడ్డి,సర్పంచ్ కొస్నం విశాల వెంకట్రాం రెడ్డి 5లక్షల రూపాయల విరాళం అందించారు.ఈ సందర్భంగా హనుమాన్ మందిర్ కమిటీ సభ్యులు వారికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం లో హనుమాన్ మందిర్ కమిటీ సభ్యులు,గ్రామపెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

రోబోటిక్ యంత్రంతో రైతులకు తగ్గనున్న ఆర్థిక భారం

యంత్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నంగునూర్, జూన్ 6, ప్రభాతవార్త : రైతుల ఆర్థిక భారం తగ్గించడానికి రోబోటిక్ యంత్రం ఎంతగానో తోడ్పడుతుందని మాజీ ఎంపిపి జాప శ్రీకాంత్‌రెడ్డి, అయిల్‌

విద్యార్థులు సర్కారు బడుల్లో చేరేలా చూడాలి : డిఇవో

పాపన్నపేట, జూన్ 6, ప్రభాతవార్త: గ్రామాల్లోని బడి ఈడు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారి కిషన్ సూచించారు. మంగళవారం యూసుఫ్‌పేట, పాపన్నపేట ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో డిఈఓ పాల్గొని పాఠశాలల కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఈఓ కిషన్ మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవంగల ఉపాధ్యాయులతో విద్యాబోధన సాగుతుందన్నారు. అంతేగాక విద్యార్థులకు డ్రస్సులు, మధ్యాహ్న భోజనం, పాఠ్యపుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ...

పాపన్నపేటలోని మండల వనరుల కేంద్రం(ఎంఆర్‌సి)లో మండలంలోని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి సుదర్శన్‌మూర్తి, ఎంపిడిఓ జగదీశ్వర్‌చారి, ఎంఇవో నీలకంఠం, నోడల్ అధికారి అంజాగౌడ్, ప్రధానోపాధ్యాయులు నాగరాజు, హరిసింగ్, సునంద, రాజశేఖర్, ఫసియోద్దీన్, సంగీత, ఉపాధ్యాయులు నర్సింలు, పద్మ, బాల మల్లేష్, రాజు, నరేందర్, జయవర్ధన్, వినోద్, శ్రీనివాస్ స్వామి, శశికుమార్, చంద్రమోహన్, రవీందర్, సిఆర్‌పిలు మహేశ్వరి, సత్యనారాయణరెడ్డి, దేవయ్య పాల్గొన్నారు.

ముగిసిన మార్షల్ ఆర్ట్స్ సమ్మర్ క్యాంప్

కరాటేలో ప్రతిభ చాటిన వారికి బహుమతులు అందచేస్తున్న రాజు

సంగారెడ్డి, జూన్ 6, ప్రభాతవార్త: ఆత్మరక్షణకు ప్రతి ఒక చిన్నారి కరాటే, కిక్ బాక్సింగ్ నేర్చుకోవాలని బిఆర్ఎస్ రాష్ట్ర నేత, పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, ముదిరాజ్‌సంఘం జిల్లా అధ్యక్షులు పులిమామిడి రాజు అన్నారు. సంగారెడ్డిలో స్పోర్ట్స్ ఆండ్ కిక్ బాక్సింగ్ మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పులిమామిడి రాజు ఆడ మగ తేడా లేకుండా ప్రతి ఒక్క చిన్నారి కరాటే, కిక్ బాక్సింగ్ నేర్చుకోవాలని సూచించారు. భవిష్యత్తులో కరాటే అకాడమీకి పిఎంఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చేరుకున్న పులిమామిడి రాజును అకాడైర్మన్ పోచయ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పిఎంఆర్ యువసేన నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఖాజాఖాన్

వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్‌ను సన్మానిస్తున్న చింత ప్రభాకర్

కంది, జూన్ 6, ప్రభాతవార్త: సంగారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా కంది గ్రామానికి చెందిన ఖాజాఖాన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియమితులైన ఖాజా ఖాన్‌ను సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ మంగళవారం ఘనంగా సన్మానించి అభినందించారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి క్షేమానికి, లాభానికి పాటుపాడలని ఖాజాఖాన్‌కు చింత ప్రభాకర్ సూచించారు. కార్యక్రమంలో సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, జడ్పీటిసి సభ్యులు కొండల్‌రెడ్డి, ఎంపిపి అధ్యక్షులు సరళ, ఆత్మకమిటీ చైర్మన్ క్రిష్ణగౌడ్, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పి మధుసూదన్‌రెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొని ఖాజాఖాన్‌ను ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

కెవికెలో రైతులతో ప్రిన్సిపల్ సైంటిస్ట్ సమావేశం

రైతులకు సూచనలు చేస్తున్న ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్ నాయక్

జహీరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త: డక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డిడిఎస్), కృషి విజ్ఞాన కేంద్రం(కెవికె) ఆధ్వర్యంలో నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్‌మెంట్(ఎన్ఏఆర్ఎం) రాజేంద్రనగర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ రమేష్‌నాయక్ సీనియర్ టెక్నికల్ అధికారి లక్ష్మణ్, అడ్మిని స్ట్రేటీవ్ అధికారులు శ్రీధర్, శేఖర్ కెవికెలో కొనసాగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో మహిళా రైతులతో ప్రత్యేకంగా సమావేశమై వారు లేవనెత్తిన పలు ప్రశ్నలకు నివృత్తిచేశారు. రానున్న రోజుల్లో కేవికేతో కలిసి ఎన్ఏఆర్ఎం సంస్థ నిధులతో వ్యవసాయంలో మరిన్ని శిక్షణ కార్యక్రమాలు చేపడతామని సైంటిస్ట్ డాక్టర్ రమేష్‌నాయక్ వివరించారు. కార్యక్రమంలో అల్గోల్ సర్పంచ్ జ్యోతిమోహన్, కెవికె బృందం, మహిళా రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన కంటి వెలుగు శిబిరాలు

-21859 మందికి పరీక్షలు-2326 మందికి కళ్లజోళ్లు

న్యాల్‌కల్, జూన్ 6, ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కంటివెలుగు శిబిరాలు మిర్జాపూర్(బి)లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో మంగళవారంతో ముగిసాయి. మిర్జాపూర్(బి) పిహెచ్‌సి పరిధి లోని 6 సబ్ సెంటర్‌ల్లోని 17 గ్రామాల్లో వైద్య అధికారులు శిబిరాలు నిర్వ హించగా శిబిరాలకు చేరుకున్న 21,859 మందికి పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు నృపెన్‌చక్రవర్తి, డాక్టర్ శ్రీదేవి పేర్కొన్నారు. కంటి పరీక్షలు చేయించుకున్న వారిలో 1379 మందికి రీడింగ్ అద్దాలు, 947 మందికి ప్రిస్క్రిప్షన్ అద్దాలను అందచేసినట్లు వివరంచారు. కంటి వెలుగు శిబిరాలు విజయవంతం అయ్యేలా సహకరించిన ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులకు, అధికారులకు, యువతకు ఆస్పత్రి వర్గాలు కృతజ్ఞతలు తెలిపారు. కంటి వెలుగు శిబిరాలను విజయవంతంముగించినందుకు మంగళవారం వైద్యులు, సిబ్బంది మిఠాయిలు పంచుకుని సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమం లో ఆసుపత్రి వైద్యులు నృపెన్ చక్రవర్తి, డాక్టర్ శ్రీదేవి, పిహెచ్ఎన్ శామల, శ్రీకన్య, విజయకుమార్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడి టీచర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్షతగాత్రులను పరామర్శించిన జడ్పీటిసి

న్యాల్‌కల్, జూన్ 6, ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చర్చి పాస్టర్, పాస్టర్ కుమార్తెలను జడ్పీటిసి సభ్యులు బోడ స్వప్న భాస్కర్ పరామర్శించారు. న్యాల్‌కల్‌లోని మెథడిస్ట్ చర్చిలో పాస్టర్‌గా మండలంలోని మిర్జాపూర్(బి) గ్రామానికి చెందిన స్వామిదాసు పాస్టర్‌గా సేవలందిస్తున్నారు. స్వామిదాసు కుమార్తెతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న తరుణంలో రోడ్డు ప్రమాదానికి గురై కొండాపూర్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స అందుకుంటున్నారు. కిమ్స్ ఆసుపత్రిలో పాస్టర్ స్వామిదాసు తన కుమార్తెతో కిలిసి చికిత్స అందుకుంటున్నట్లు తెలుసుకున్న జడ్పీటిసి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో చర్చి లెమెన్‌లు ఎర్పుల నర్సింలు, బాబు, నాగేష్ నర్సిములు, కృష్ణ, రవికుమార్ తదితరులు ఉన్నారు.

మాట్లాడుతున్న ఎంపిపి చందనరెడ్డి, సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

సమన్వయంతో పనిచేస్తే అభివృద్ధి తథ్యం

మండల సభలో ఎంపిపి చందనరెడ్డి

పాపన్నపేట, జూన్ 6, ప్రభాతవార్త: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మండలం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందడం తథ్యమని ఎంపిపి అధ్యక్షులు చందన ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఎంపిపి అధ్యక్షులు చందన ప్రశాంత్‌రెడ్డి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి అధ్యక్షులు చందనరెడ్డి మాట్లాడుతూ మండల సభకు అధికారులు నామమాత్రంగా వస్తున్నారని, సభలో సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ అధికారుల పని తీరుపై మండల సభ్యులు, సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తంచేస్తూ కనీసం ఫోన్‌లు సైతం ఎత్తడం లేదని, ఇలా అయితే ఎలా అని ప్రశ్నించారు. ముద్దాపూర్ గ్రామంలో 18 విద్యుత్ స్థంభాలు పాతి మూడు సంవత్సరాలు గడుస్తున్నా వైర్లు భిగించడం లేదని, పలు మార్లు మండల సభలో సమస్యను లేవనెత్తినా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామ సర్పంచ్ దానయ్య, డ్యాతండా సర్పంచ్ హీరాలాల్‌లు విచారం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలు చెప్పుకుందామంటే వినే అధికారులే కరువయ్యారని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేశారు. నెల రోజుల క్రితం గాలిదుమారానికి విద్యుత్ స్థంభాలు పడిపాయాయని, ఫలితంగా పంటలక సాగు నీరు అందించే ఆస్కారం లేకుండా పోయిందని ఎల్లాపూర్ సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఎల్లాపూర్‌లో గతంల ఇద్దరు మత్స్యకారులు నీట మునిగి మృతి చెందినా ఇంత వరకు ఇన్సురెన్స్ డబ్బులు రాలేదని ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పనులకు సంబంధించి కాంట్రాక్టు పనులను మండలానికి చెందిన ఒకరికి అప్పగించడంతో పనులు జరగడంలేదని సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యుల సమస్యలు విన్న ఎంపిపి చందనరెడ్డి స్పందిస్తూ సమస్యలు పరిష్కరించకుంటే అధికారులు సమావేశానికి వచ్చి ఏమ ప్రయోజనమని నిలదీశారు. అంగన్‌వాడి సూపర్ వైజర్ మాట్లాడుతూ వచ్చే మాసం నుంచి బరువు తక్కువ ఉన్న చిన్నారులకు బాలామృతం ప్లస్ పంపిణి చేస్తామని, గ్రామస్థులు వాటిని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కుమ్మరి జగన్, మండల ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ పోలీస్ వెంకట్రామిరెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు గౌస్, సర్పంచ్‌లు గురుమూర్తి గౌడ్, హిరాలాల్, లింగారెడ్డి, పాపన్నపేట ఎంపిటిసి సభ్యులు ఆకుల శ్రీనివాస్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ చేవెళ్ల పట్టణ అధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి

చేవెళ్ల, జూన్ 6, ప్రభాతవార్త

బిఆర్ఎస్ చేవెళ్ల పట్టణ అధ్యక్షుడుగా చేవెళ్ల గ్రామానికి చేందిన జూకన్నగారి జైపాల్‌రెడ్డి ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. బిఆర్ఎస్ చేవెళ్ల పట్టణ అధ్యక్షుడుగా జూకన్నగారి జైపాల్‌రెడ్డికి నియమకపత్రాన్ని మంగళవారం చేవెళ్ల ఏమ్మేల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఏమ్మేల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ పార్టీ పటిష్టతకు ప్రతి ఒక్కరు పాటుపడాలని, పార్టీని గ్రామ స్థాయిలో పటిష్టం చేసేందుకు శాయశక్తుల కృషి చేయాల న్నారు. పార్టీకి కార్యకర్తలే పట్టని, రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి పాటుపడాలన్నారు. చేవెళ్ల పట్టణంలో పార్టీని మరింత బలోపేతనం చేసేందుకు తన శాయశక్తుల కృషి చేస్తామని చేవెళ్ల పట్టణ నూతన అధ్యక్షుడు జూకన్నగారి జైపాల్‌రెడ్డి అన్నారు. తనపై నమ్మకంతోపదవిని కట్టబెట్టినందుకు పార్టీని ముందుకు తీసుకుపోతానన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రవీకాంత్‌రెడ్డి, నాయకులు మర్పల్లి క్రిష్ణారెడ్డి, కావడి తిరుపతిరెడ్డి, కనకమామిడి శివశం కర్‌రెడ్డి,దండు సత్తి, అలూరు వెంకటేష్, మల్కాపూర్ రవి, నరేందర్, కుమా ర్, పులపల్లి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పాతకొడంగల్‌లో బడిబాట కార్యక్రమం

కొడంగల్,జూన్ 6ప్రభాతవార్త

కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని పాతకొడంగల్‌లో మంగళవారం ప్రభుత్వ ప్రాధమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు క్రాంతికుమార్ అధ్వర్యంలో బడిబా ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి తిరిగి పిల్లలను పాఠశాలలో చేర్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రభుత్వ పాఠశాల బలోపే తానికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని అందులో భాగంగా నాణ్యమైన విద్యను అందిస్తు మధ్యాహ్న భోజన సదుపాయం, ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులను అందించడం జరుగుతుందన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలలో గల సదు పాయాలను తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యా యురాలు సంధ్య తదితరులున్నారు.

మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ వాణీయాదవ్‌కు సన్మానం

కొడంగల్,జూన్ 6ప్రభాతవార్త

కొడంగల్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ వైస్‌చెర్మేన్‌గా ప్రమాణస్వీకారం చేసిన ఆర్.వాణీమధుసుదన్‌యాదవ్‌ను నారాయణపేట్ జిల్లా గ్రంధాలయ చెర్మేన్ శ్యాసం రామకృష్ణ సన్మానించారు. మంగళవారం కొడంగల్‌లో అమె స్వగృహంలో పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కొడంగల్ మార్కెట్‌కమిటీ వైస్‌చెర్మేన్‌గా రైతులకు సేవలు అందిస్తు మార్కెట్‌కమిటీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మున్సిపల్ కౌన్సిలర్ మధుసుదన్‌యాదవ్, బిచ్చప్ప, రమేష్, మంజుల యాదవ్, బండిగోపాల్ తదితరులు ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎస్సై రవిగౌడ్

కొడంగల్,జూన్ 6ప్రభాతవార్త : రాజీ మార్గమే రాజమార్గంగా ఈనెల 10న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రవిగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతు చిన్న చిన్న తగాదాలు, మనస్పర్ధలతో కోర్టుల చుట్టూ తిరుగుతు తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా రాజీ మార్గమే రాజమార్గంగా ఇరుపక్షాల రాజీతో పరిష్కారానికి అమోదయోగ్యమైన కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ఇందుకుగాను మీ మీద కానీ, మీకు తెలిసిన వాళ్ళ మీద కానీ, మీ బంధువులపైనా ఏవైనా నమోదైన కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. రాజీ చేసుకునే ఇరువర్గాల వారు జూన్ 6 నుంచి 10వ తేదిలోపు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కకు హజరైనట్లయితే వారిని కోర్టులో ప్రవేశపెట్టి ఇరువర్గాల రాజీ మేరకు కేసును కాంప్రమైజ్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించే కేసుల్లో ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు, ఘర్షణలు, చీటింగ్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, భూతగాదాలకు సంభందించిన కేసులు పరిష్కరించుకునే అవకాశం ఉంటుందన్నారు. అలాగే వివాహ బంధానికి సంభందించిన కేసులు, చిన్నచిన్న దొంగతనం కేసులు, అక్రమ రవాణ (ఇసుక, మట్టి, కలప, మద్యం), పేకాట, లాక్‌డౌన్ కేసులతో పాటు ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులు, కుటుంబ తగాదాలు, గుట్కా విక్రయాలు, తరలింపు తదితర కేసులు లోక్ అదాలత్‌లో రాజీ చేసుకొని కేసును క్లోజ్ చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. దీనికోసం ఫిర్యాదుదారుడు, నేరస్తుడు ఇద్దరు తమ ఆధార్‌కార్డులను తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు రావాల్సి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గౌడవెల్లిలో మౌలిక వసతుల కల్పనకు కృషి

-మాజీ ఎంపిపి పద్మాజగన్‌రెడ్డి

మేడ్చల్, జూన్ 6. ప్రభాతవార్త ః గ్రామంలో మౌళిక వసతుల కల్పనకు తనవంతు సహకారం అందిస్తున్నానని మేడ్చల్ మాజీ ఎంపిపి పద్మాజగన్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ మండలంలోని గౌడవెల్లి గ్రామంలో రూ. 2 లక్షల మండల పరిషత్ నిధులతో చేపడుతున్న అంతర్గత మురికి కాలువల నిర్మాణ పనులను ప్రారంభించిన ఆమె ఈ సందర్భంగా మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి సహకారంతో గ్రామంలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని అన్నారు. తనను గెలిపించిన ప్రజలకు శక్తివంచన లేకుండా సేవలు అందించేందుకు నిరంతరం పాటుపడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్ ముదిరాజ్, ఉప సర్పంచ్ పెంటమ్మ, మాజీ ఎంపిటిసి లావణ్య, మాజి సర్పంచ్ జగన్‌రెడ్డి, వార్డు సభ్యులు సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్ ముదిరాజ్, జ్యోతిరెడ్డి, సదానందగౌడ్, మల్లికార్జున్, నారాయణ, రాజు గౌడ్, సత్యనారాయణ, యాదగిరి, కవిత, నారాయణ, యుగపతి తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో బిఆర్ఎస్ విఫలం

పెద్దేముల్, జూన్ 6, ప్రభాతవార్త:

సుస్థిర పాలన అందించడం కాంగ్రెస్‌కే సాధ్యమని, కాంగ్రెస్ హయంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు యం.రమేష్ మహరాజ్ అన్నా రు. హత్ సే హత్ జోడో కార్యాక్రమంలో భాగంగా మంగళవారం మండల పార్టీ అధ్యక్షుడు గోపాల్ అధ్వర్యంలో పెద్దేముల్ మండలంలోని కందనెల్లి, మంబాపూర్, రుక్మాపూర్, రెగొండి, తదితర గ్రామాలలో నిర్వహించిన కార్యాక్రమానికి టీసీసీసీ రాష్ట్ర ఉపాధ్యాక్షుడు యం.రమేష్ మహరాజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా యం.రమేష్ మహరాజ్ మాట్లాడుతూ నిరుద్యోగ భృతి, రుణమాఫీ, డబుల్‌బెడ్‌రూంఇండ్లు తదితర వాటిలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని అన్నారు. పండించిన ధాన్యాన్ని ఇంతవరకు కొనుగోలు చేయకపోవడంతో రైతులు నానా అవస్థలు పడుతున్నారని, కేసిఆర్ ప్రభుత్వం రైతు పక్షపాతి అని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ హయంలోనే ఇందిరమ్మ ఇండ్లు, పావలవడ్డి రుణాలు, ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్ తదితర పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందని అన్నారు. రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రెండు లక్షల రుణమాఫీ, ఇళ్లులేని నిరుపేదలకు ఇండ్లు, భూమిలేని నిరుపేదలకు ఇన్సూరెన్స్ తదితర పథకాలను ప్రవేశపెట్టడం జరుగుతుందని అన్నారు. తాండూరు ప్రాంతం నుంచి తనకు ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించాలని, అభివృద్ధి ఎందో చేసి చూపి స్తానని అన్నారు. జడ్‌పిటిసి ధారాసింగ్ మాట్లాడుతూ ఈ నెల 18న జరిగే యూత్ క్విజ్ పోటీలలో యువత పాల్గొన్ని తమ ప్రతిభను చాటాలని అన్నారు. రైతులను నిలువెల్లా దగా చేస్తున్న కేసిఆర్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పె రోజు లు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. రాబోయే రోజులలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని దీమా వ్యక్తంచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ మహీ ళా అధ్యక్షురాలు శోభారాణి, మాజీ యంపిటిసి డి.రాజు, నాయకులు మంతటి బుగ్గ య్య, మైపూస్, కిరన్, వహీద్, మౌలానా, నర్సి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుతో ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరిగాయి: చైర్మన్

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 6, ప్రభాతవార్త:

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ హయంలో పరిశ్రమలు ఇమ్మడిముమ్మడిగా లక్షాలాది మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించిందని మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్ రెడ్డి అన్నారు. పోచారం మున్సిపల్ పరిధిలోని ఇన్ఫోసిస్ ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం పారిశ్రామిక ఉత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ పాల్గొని మాట్లాడుతూ ఇన్ఫో సిస్ కంపెనీ 9 వేల మంది ఉద్యోగులతో ప్రారంభమై నేడు 42 వేల మందికి ఉద్యో గులకు ఉపాధి కల్పిస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత రాష్ట్రం అన్ని రంగాల్లో మాదిరిగానే పారిశ్రామిక రంగం ఎంతో ఎత్తుకు ఎదిగిందని అన్నారు. ప్రభుత్వం పరిశ్రమలకు 30 రోజుల్లోగా అనుమతులు ఇస్తుందని అన్నారు. ఈ సందర్భంగా ఇన్ఫోసిస్ క్యాంపస్‌లో చైర్మన్ మొక్కలు నాటి నీళ్లు పోశారు. ఈ కార్య క్రమంలో చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ ఎ. సురే శ్, మున్సిపల్ కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, సింగిరెడ్డి సాయిరెడ్డి, ఇన్ఫోసిస్ రీజన ల్ మేనేజర్ వెంకటేశ్, సంస్థ ప్రతినిధులు లతసుబ్రమణ్యం, రాజశేఖర్ కటరం, ప్రసాద్ నల్ల, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంటు జి. బాలేశ్, ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి శేఖర్, నాయకులర్రీ కాశయ్య, తిలక్ నాయక్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలి

నర్సాపూర్, జూన్ 6, ప్రభాతవార్త:

ఈ నెల 10న నర్సాపూర్ కోర్టులో నిర్వహించే లోక్‌అదాలత్‌లో కక్షిదారులు కేసులను రాజీ కుదుర్చుకొని సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల్ లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ కె.అనిత పేర్కొన్నారు. రాష్ట్ర న్యాయ సేవా అధికారిక సంస్థ ఆదేశాల మేరకు మెదక్ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ అధ్వర్యంలో మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ అధ్వర్యంలో ఈ నెల 10 న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించటానికి పోలీస్ అధికారులు, న్యాయవాదులతో సమీక్షా సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న న్యాయమూర్తి కె.అనిత మాట్లాడుతూ జాతీయ మెగా లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని ఈ నెల 10న నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో నిర్వహిస్తున్నందున కక్షిదారులు పంతాలకుపోకుండా తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా రాజీ కుదుర్చుకొని కేసులలో ఇరువర్గాల వారుప్రేమ అనురాగాలతోకలిసి మెలిసి ఉండటం కోసం రాజీ చేసుకొని ఈ జాతీయ లోక్‌అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పోలీసుఅధికారులకు, న్యాయవాదులకు సలహాలను, సూచనలు ఇస్తూలోక్ అదాలత్‌లో ఎక్కువమొత్తంలో కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏజిపి సత్యనారాయణ, సిఐ షేక్‌లాల్ మధార్, సీనియర్ న్యాయవాది ఎండి జాఫర్, ఎస్ఐ శివకుమార్, కౌడిపల్లి ఎస్ఐ శివ ప్రసాద్‌రెడ్డి, శివ్వంపేట ఎస్ఐ రవికాంతారావు, చిలిపిచెడ్ ఎస్ఐ గౌసొద్దీన్, లీగల్ ఫ్యానల్ అడ్వకేట్ స్వరూపరాణి, మధుశ్రీ, న్యాయవాదులు ప్రకాష్, ఆనంద్‌కుమార్, ప్రభు, రాజునాయక్, నాగరాజు, కోర్ట్ కానిస్టేబుల్స్ ఏఎస్ఐ సుధారాణి, అబిషేక్, దిలీప్‌కుమార్, హరిబాబు, అనిల్‌కుమార్, కోర్టు సిబ్బంది, లీగల్ సర్వీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జి, లీగల్ సర్వీస్ కమిటీ మండల్ చైర్మన్ అనిత

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న అనిత

రాయరావు చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఊరూర చెరువుల పండగకు ఏర్పాట్ల పరిశీలన

నర్సాపూర్, జూన్ 6, ప్రభాతవార్త: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8న ఊరూర చెరువుల పండగను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం నర్సాపూర్ మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ ఆధ్వర్యంలో వివిద ప్రభుత్వశాఖల అధికారులు రాయరావు చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, అవాంఛనీయ స